# సాహసమే జీవితం?!

ప్రఫుల్ల చంద్ర

**విశాఖ రైల్వే క్యాంటిన్ లో కాఫీ తాగుతోన్న రీతూ బిగుతుగా వున్న జీన్స్ ధరించి మెరుపు తీగలా వుంది. వేలాడుతున్న మేఘంలా ఆమె షర్ట్. మగవాడిలా పొట్టిగా జుత్తు క్రాఫింగ్ చేయించుకుంది. కళ్ళలో తెలివితేటల్ని సూచించే కాంతి. చెరగని చిరునవ్వుతో విలక్షణంగా, ఆకర్షణీయంగా ఆత్మవిశ్వాసం పోతపోసినట్టు కనిపిస్తోంది.**

ఆలోచిస్తోందామె.

స్టేషనంతా గోలగోల!...శబ్ద కాలుష్యం!

రాజస్థాన్ పిలాని లోని బిట్స్‌లో చదువుతున్న రీతూ తమ సంస్థ తరపున విశాఖ ఆంధ్ర యూనివర్శిటీలో ఒక కార్యక్రమంలో పాల్గొని–తిరిగి పిలానికి వెళ్ళేముందు అనపర్తి వెళ్ళి తన కుటుంబ సభ్యుల్ని సర్ప్రైజ్ చేయాలని అప్పటికప్పుడు నిర్ణయించుకుని స్టేషన్‌కొస్తే బండి లేదు. ఒక గంట మంచి వెయిటింగ్.

కాలాన్ని వృధా చేయడం నేరంగా భావించే రీతూకి చిరాగ్గా వుంది. అయితే ఒక అరగంటలో ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ వుంది గానీ అది అనపర్తిలో ఆగదు. రాజమండ్రిలో దిగి అక్కడి నుంచి వెనక్కి పాతిక కిలోమీటర్లు రావాలి...వేస్ట్!

ఫలక్‌నుమా తర్వాత అరగంటలో వచ్చే ఎక్స్‌ప్రెస్ అనపర్తిలో ఆగుతుంది గానీ ఎక్కువ టైమ్ తీసుకుంటుంది.

వేస్ట్ ఆఫ్ టైమ్! క్రిమినల్ వేస్ట్ ఆఫ్ టైమ్!!

హఠాత్తుగా రీతూ దృష్టి క్యాంటీన్ గోడకి వున్న టీవీ మీద పడింది. ఏదో డ్రింక్ బాపతు యాడ్ వస్తోంది. కాలికి తాడు కట్టుకుని అంత ఎత్తు నుంచి కిందకు బంజీ జంప్ చేసి నదిలో పడిపోయిన డ్రింక్ సీసాని పైకి తీసుకొస్తాడు ఒక సాహసి.

'భేష్! అదీ జీవితం! సాహసమే జీవితం!! మనిషన్నాక సాహసాలు చేస్తూ ఏదో ఒకటి సాధిస్తూ వుండాలి! ముద్దపప్పులా ఒకే చోట పడివుండకూడదు' అనుకుంది రీతూ.

సరిగ్గా అదే సమయంలో ఆమె మస్తిష్కంలో ఒక సాహస కార్యం ఫ్లాషయ్యింది. అంతలో చెవులు చిల్లులు పడేట్టు కూత వేసుకుంటూ ప్లాట్‌ఫాం మీదికొచ్చి ఆగింది ఫలక్‌నుమా.

*** *** ***

ఎవరైనా దొరికితే చాలు తన కూతురు గొప్పలు చెప్పకోవడం లెక్చరర్ మూర్తికి హాబీ. "మా అమ్మాయి బిట్స్‌లో చదువుతోంది తెలుసా?" అన్నాడాయన సగర్వంగా స్టాఫ్ రూమ్‌లో.

"అబ్బ! అంత దూరం! పైగా ఒంటరి అమ్మాయి" నసిగింది కొత్త లెక్చరర్ మిత్ర.

"మీరు స్త్రీ అయ్యుండీ అలా అనకూడదు మేడమ్! ఈరోజుల్లో దూరం, ఒంటరితనం అనే మాటలకు అర్ధమే లేదు! మీరు మా అమ్మాయిని చూడలేదు గాని ఆ డ్రైవ్, ఆ డాష్." పంచాంగం విప్పాడు మూర్తి.

మూర్తికి ఇద్దరూ అమ్మాయిలే. అబ్బాయిలు లేరు. అయినా అదో లోటుగా భావించక అమ్మాయిల్ని అబ్బాయిల్లాగానే పెంచాడాయన. పెద్దమ్మాయి నీతూ నెమ్మదీ..పొందిక. వివాహం అయి విజయవాడలో హాయిగా వుంది. ఇక రెండో అమ్మాయి రీతూ చిన్నప్పటి నుంచీ మహా చలాకీ. భయం ఎరుగదు. తను నాలుగో క్లాసు చదివే రోజుల్లో– గుడి వెనుక కొలనులో ఒక పాప మునిగిపోతే నిర్భయంగా రీతూ కొలను లోకి దూకి ఆ పాపను జుత్తు పట్టుకుని గట్టుకి లాక్కొచ్చేసింది.

వింత ఏమిటంటే అప్పట్లో రీతూకి ఈత రాదు! మరి ఎలా తను ఆ పాపని రక్షించగలిగిందో! అదో మిస్టరీ!.

నిజానికిందులో మిస్టరీ ఏమీ లేదు. ఈతరాని ఇద్దరమ్మాయిల్లో ఒకరు మునిగి పోవడానికి, రెండో అమ్మాయి తనని తాను రక్షించుకోవడమే కాక మొదటి అమ్మాయిని కూడా రక్షించగలగడానికీ ఒక్కటే కారణం. 'సాధించి తీరాలన్న దృఢ సంకల్పం, మొండి పట్టుదలా ఒకరికి వుండి, మరొకరికి లేకపోవడమే.

ఏదైతేనేం ఆ సంఘటన సంచలనం కలిగించి పత్రికలకు ఎక్కడం, ప్రచారం జరగడం, రాష్ట్రపతి రీతూకి "సాహసబాల" అవార్డు ప్రదానం చేయడం చకచకా జరిగిపోయాయి. కన్నతండ్రికి అంతకన్నా గర్వకారణం ఏముంటుంది? అంతా విని–

"మీరెన్నయినా చెప్పండి. సాహసం మగవారికి నప్పినట్టు ఆడవారికి ఒప్పదు" అంది మిత్ర.

"మీరు స్త్రీ అయ్యి వుండీ..." పాత డైలాగే వేశాడు మూర్తి.

"నేను స్త్రీని కనుకనే, సాహస స్త్రీలకు ఎదురయ్యే సమస్యలూ, సాధక బాధకాలూ నాకు అర్ధం అయ్యినట్టుగా మీకు అర్ధం కావు. తెగువ కల మగువను ఏ భర్తా భరించలేడు! నిజం చెప్పండి, మీ భార్య మిమ్మల్ని ఎదిరిస్తే మీరు భరించగలరా?" సూటిగా అడిగిందామె.

సమాధానం చెప్పకుండా చిన్నగా నవ్వేశాడు మూర్తి.

ఆయనదొక విచిత్ర పరిస్థితి.

ఆయనేమో కాకినాడ కాలేజీలో పని చేస్తున్నాడు. హోటల్ తిండి, మఠం నిద్ర! ఆయన భార్య సరస్వతి రాజమండ్రి సమీప గ్రామంలో జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్. ఆమె కూడా ఆ గ్రామంలో ఒంటరిగానే వుంటున్నది. సెలవుల్లోనే వాళ్ళు కలిసేది.

అయితే ఒక సమస్య వచ్చి పడింది. పెద్దమ్మాయి గర్భవతి. పుట్టింటికి తీసుకు రావాలి. కాకినాడకు తీసుకొద్దామంటే ఆడదిక్కు లేదు. తల్లి వద్దకు పంపుదామంటే అక్కడ మగదిక్కు లేదు. పైగా వైద్య సదుపాయం లేని గ్రామం. ఎలా మరి?!


మూర్తి తమ్ముడు రామారావు అనపర్తిలో పెద్ద పేరున్న డాక్టరు. నర్సింగ్ హోం ఉందతనికి. తమ ఇల్లే పుట్టిల్లుగా భావించి అమ్మాయిని తమ ఇంటికే పంపమని కోరాడు. సమస్య అలా తీరింది.

నెల రోజుల క్రితమే నీతూని తీసుకొచ్చి అనపర్తిలో బాబాయి గారింట దింపారు తల్లిదండ్రులు. సెలవుల్లో వచ్చి చూసిపోతున్నారు. అయితే ప్రసవించే రోజు సమీపించడంతో వాళ్ళు వారం రోజులు సెలవు పెట్టి అనపర్తి వెళ్ళడానికి సిద్ధపడుతున్నారు తల్లిదండ్రులు.

ఇక్కడ మూర్తి స్టాఫ్ రూమ్‌లో రీతూ పంచాంగం విప్పుతున్నప్పుడే అక్కడ ప్రిన్సిపాల్ సరస్వతి ముసలి అసిస్టెంట్ వద్ద తన గోడు వెళ్ళబోసుకుంటోంది అనపర్తి బస్సు కోసం ఎదురు చూస్తూ.

ఒకటీ రెండు రోజుల్లో ప్రసవించబోయే నీతూ గురించి ఆమెకు ఆందోళన ఏమీ లేదు. ఆమె బెంగా, భయం అంతా రీతూ గురించే.

ఈత రాకపోయినా రీతూ కొలనులోకి దూకి అమ్మాయిని రక్షించి అవార్డు పొందినందుకు అందరూ అభినందిస్తే ఆమె మాత్రం భయపడింది. మగవాడిలా జుత్తు కత్తిరించుకుని ప్యాంటూ, షర్టులతో తిరిగే మొట్టమొదటి అమ్మాయిగా తమ



గ్రామంలో రీతూ గుర్తింపు పొందినప్పుడూ ఆమె భయపడింది. కరాటే నేర్చుకుని రీతూ ఆ వీధిలోని పోకిరీ కుర్రాళ్ళ పని పట్టినప్పుడూ ఆమెకు భయమే కలిగింది. విశ్వ విఖ్యాత 'బిట్స్'లో సీటు సంపాదించిన ప్రప్రథమ మహిళగా స్వగ్రామంలో రీతూ ప్రఖ్యాతి పొందినప్పుడూ ఆమె భయం తగ్గలేదు.

"ఏం చేస్తాం! ఆ తండ్రికి అది గారాల పట్టి! అమ్మాయి సాహసం చూసి మురిసిపోతూ 'వీరులదే విజయం! సాహసవంతులే సాధిస్తారు!' అని కొటేషన్లు చెబుతూ వుంటారాయన. కాని దానికసలు పెళ్ళి అవుతుందా? సరిగ్గా కాపురం చేస్తుందా! అని నా భయం!" అంది సరస్వతి బాధగా.

"బాధ పడకండి మేడమ్! తప్పక వివాహం జరుగుతుంది. జీవితాన్ని మించిన బోధకుడు లేడు. సంసారంలో పడ్డాక అమ్మాయి మారుతుంది లెండి" ఓదార్చింది ముసలి అసిస్టెంటు.

రాత్రి రీతూ గురించి పీడకల రావడం వల్ల ఆ రోజంతా సరస్వతి మనసు వికలంగానే వుంది. రీతూ మరీమరీ జ్ఞాపకం వస్తోంది. దాన్ని వెంటనే చూడాలనిపిస్తోంది గానీ ఎప్పటికీ చూడలేనేమోనని భయం! అనపర్తికి వెళ్ళగానే ఫోన్ చేయాలని అనుకుంది కాని తను ఫోన్ చేయలేవనీ, చేసినా బదులు రాదనీ ఏదో భయం! కారణం లేని భయం!

"ఛ! వూరుకోండి మేడమ్! మీరు అనవసరంగా భయపడి మనసు పాడుచేసుకోకండి. అలా ఏమీ జరగదు. మీరు హాయిగా అనపర్తి వెడతారు. అమ్మాయికి ఫోన్ చేస్తారు. అమ్మాయి వస్తుంది" ధైర్యం చెప్పింది అసిస్టెంట్.

అప్పుడే బస్సు రావడంతో కళ్ళు తుడుచుకుని అనపర్తి బయల్దేరింది సరస్వతి.

*** *** ***

సరిగ్గా అప్పుడే మూర్తి కూడా అనపర్తి బయల్దేరాడు.

కాకినాడ నుంచి అనపర్తి వెళ్ళాలంటే బస్సే అనుకూలం. కాని మూర్తికి బస్సు ప్రయాణం పడదు. సాటి లెక్చరర్ ఆయన్ని స్కూటర్ మీద సామర్లకోట స్టేషన్ వద్ద దింపాడు.

బండి ఒక గంట లేటు.

స్టేషన్‌లో బెంచి మీద కూర్చుని ఓ మ్యాగజైన్ తెరిచాడో, లేదో నిద్ర ముంచుకొచ్చింది. బెంచి మీదనే ఒరిగిపోయాడు. ఆయన కళ్ళు తెరిచేసరికి ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ వెళ్ళిపోతోంది. ఆ బండిలోనే రీతూ వుంది. ఆ విషయం ఆయనకు తెలియదు! తండ్రి అక్కడ వున్నట్టు ఆమెకు తెలియదు.

మరో గంటకు ఇంకో ఎక్స్‌ప్రెస్ రావడం, ఆయన ఎక్కడం, అనపర్తిలో దిగడం జరిగిపోయాయి.

ఏదో యాక్సిడెంట్ అయ్యింది కాబోలు. ప్లాట్‌ఫాం చివర జనం మూగి వున్నారు. కోలాహలంగా వుంది. కూతుర్ని చూడాలన్న ఆత్రంలో మూర్తి పట్టించుకోకుండా గబగబా వెళ్ళిపోయాడు.

ఆయన తమ్ముడి గారింటిలో అడుగు పెట్టేసరికి భార్య సరస్వతి అప్పుడే వచ్చి వుంది.

"అమ్మాయిని నిన్ననే నర్సింగ్ హోంలో చేర్పించారట" అని చెప్పింది మూర్తితో.

ఇద్దరూ నర్సింగ్ హోంకి వెళ్ళారు. నీతూ హాయిగానే వుంది. ఏ సమస్యా లేదని చెప్పాడు తమ్ముడు.

ఈలోగా...ఫోన్.

"డాక్టర్ గారూ! నేను రైల్వే స్టేషన్ మాస్టర్‌ని. ఇక్కడొక యాక్సిడెంట్ అయ్యింది. మీరొకసారి రాగలరా?"

"సారీ! నేను బిజీగా వున్నాను. యాక్సిడెంట్ అయితే నన్ను పిలుస్తారేం! గవర్నమెంట్ డాక్టర్‌ని పిలుచుకోండి!"

"ట్రీట్‌మెంట్ కోసం కాదు సార్! గవర్నమెంట్ డాక్టర్ ఇక్కడే వున్నారు. శవాన్ని గుర్తుపడతారేమోనని మిమ్మల్ని పిలుస్తున్నా".

"అరే! నేను బిజీగా వున్నా" అంటూ ఫోన్ పెట్టేశాడు రామారావు.

మరో అరగంటలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ వచ్చాడు. ఆ సమయంలో సరస్వతి, మూర్తి ఇద్దరూ డాక్టర్‌గారి గదిలోనే వున్నారు. సరస్వతి రీతూకి ఫోన్ చేసే ప్రయత్నంలో వుంది.

ఇన్‌స్పెక్టర్ చెబుతున్నాడు.

"ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్ లోంచి ఒకమ్మాయి ప్లాట్‌ఫాం మీద పడిపోయింది డాక్టర్ గారూ! తల చితికిపోయి గుర్తు పట్టడానికి వీల్లేకుండా వుంది. ఎవరైనా దుండగులు ఆమెను ట్రెయిన్ లోంచి తోసేసి వుంటారని అనుమానం. రాజమండ్రి పోలీసులకు ఫోన్ చేసి ఎంక్వయిరీ చేయించాం. ఆ బోగీలో వున్నవాళ్ళు చెప్పినదేమిటంటే–

ఆ అమ్మాయే ముందుగా తన బ్యాగుని ప్లాట్‌ఫాం మీదకు విసిరేసి, తర్వాత తనూ దూకేసిందని! స్టేషన్ సమీపిస్తున్నప్పుడు ట్రెయిన్ వేగం తగ్గుతుంది కదా! అందువల్ల దూకేసినా ప్రమాదం వుండదని ఈ సాహసానికి ఒడిగట్టి వుంటుంది. ఆమె వద్ద అనపర్తికి టికెట్ వుంది. ఆ బ్యాగ్‌లోని పుస్తకాలను బట్టి ఆ అమ్మాయి మీ బంధువు అయి వుంటుందని అనుమానిస్తున్నాం. అమ్మాయి జీన్స్, షర్ట్ ధరించి వుంది. అబ్బాయి లాగ జుత్తు క్రాఫింగ్ చేయించుకుని..."

ఇన్‌స్పెక్టర్ చెబుతూ వుండగానే సరస్వతి చేతిలోని ఫోన్ జారిపోయింది.

"అమ్మా! రీతూ!" అని గావుకేక పెట్టి స్పృహ తప్పి పడిపోయింది. మూర్తి స్థాణువై పోయాడు.